

చెరువు మట్టి..నిలువునా లూటీ!
కురబలకోట మండలంలోని నార్లపల్లె చెరువును మట్టి మాఫియా కబలిస్తోంది. జేసీబీలు, టిప్పర్లతో యథేచ్ఛగా మట్టితోలి అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. -8లో



మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ దుర్మార్గం
ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.140	రూ.180
రెండోరకం	రూ.90	రూ.130

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 136 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
సీబీ	711	711
బైవోల్టిన్	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 280.00 కిలోలు

న్యూస్‌రీల్

నేడు ఒంటిమిట్ట రామాలయం మూసివేత

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయాన్ని చంద్రగ్రహణం కారణంగా ఆదివారం మూసివేయనున్నట్లు టీటీడీ ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్ శనివారం తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం వరకు స్వామివారి దర్శనం ఉంటుందని తెలిపారు. మధ్యాహ్నం 1:50 గంటలకు ఆలయాన్ని మూసివేస్తామని, తిరిగి 8వ తేదీ తెల్లవారుజామున ఆలయ శుద్ధి, సంప్రోక్షణ చేసి యథావిధిగా భక్తులను ఆలయంలోకి అనుమతిస్తామని పేర్కొన్నారు. అయితే ఆదివారం జరిగే పౌర్ణమి కల్యాణాన్ని ఎప్పటిలాగే ఉదయం 9:30 నుంచి నిర్వహిస్తామన్నారు. ఈ విషయాన్ని భక్తులు గమనించాలని కోరారు.

శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం


పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఆలయ అధికారులు

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి దేవాలయంలో శనివారం స్వామి వారికి శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. టీటీడీ అధికారులు స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. పండితులు వీటిని స్వామివారికి అలంకరించారు. పాలు, పెరుగు, నెయ్యి, కొబ్బరి నీళ్లతో అభిషేకాలు జరిపారు. సుగంధ పరిమళమైన తులసీ గజమాలలు సీతా రామలక్ష్మణుల మెడలో ధరింపజేసి, కుంకుమార్చన, మంగళహారతులు కావించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

10న ఉద్యోగమేళా

రాయచోటి జగదాంబసెంటర్: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్, జిల్లా ఉపాధి కార్యాలయం, డీఆర్‌డీఏ సీడాప్ అన్నమయ్య జిల్లా వారి ఆధ్వర్యంలో ఈ నెల 10న ఉద్యోగమేళా నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా ఉపాధి అధికారి ఎ.సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రాయచోటి పట్టణం మాసాపేటలోని శ్రీ శివ నర్సింగ్ కళాశాలలో ఉద్యోగమేళా జరుగుతుందన్నారు. డిగ్రీ, బీటెక్, పీజీ, ఫార్మసీ చదివి 40 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన నిరుద్యోగులు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాలకు 8897776368 నంబర్‌లో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

గండి అంజన్నకు భారీ ఆదాయం

వేంపల్లి: మండలంలోని గండి వీరాంజనేయ స్వామి ఆలయానికి శనివారం ఒక్క రోజే భారీగా రూ.4.03 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వెంకట సుబ్బయ్య తెలిపారు. స్వామి వారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు రావడం వల్ల ఈ ఆదాయం వచ్చిందని ఆయన పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం 4 గంటలకు చంద్రగ్రహణం కారణంగా స్వామివారి ఆలయం మూసి వేయనున్నట్లు పేర్కొన్నారు. తిరిగి సోమవారం తెల్లవారుజామున 5 గంటలకు సంప్రోక్షణ చేసి ఆలయాన్ని తెరిచి శుద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు.

సైబర్ నేరాలు అరికట్టడంపై అవగాహన

చాపాడు: ఆర్థిక సైబర్ నేరాలు అరికట్టడంపై అవగాహన పెంచుకోవాలని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ శైలజ పేర్కొన్నారు. వైఎస్‌ఆర్ కడప జిల్లా చిన్న గురువలూరు జెడ్పీ హైస్కూల్‌లో శనివారం హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ రిజర్వ్ బ్యాంక్ ఆధ్వర్యంలో డిపాజిటర్స్ ఎడ్యుకేషన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరైనా తమ ఖాతాల్లో డబ్బు మాయమైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలన్నారు. రాటా సంస్థ కళా బృందం జానపద గీతాలు, ఇంద్రజాల ప్రదర్శనలతో అవగాహన కల్పించింది.

రాయచోటి ఘాట్‌రోడ్‌లో చిరుత సంచారం



రాజంపేట: రాజంపేట–రాయ చోటి ఘాట్‌రోడ్‌లో చిరుత సంచారం కలకలం రేపింది. ఘాట్‌రోడ్డునుంచి రాజంపేట ఎస్‌ఆర్‌పాలెం, ఎకోపార్కు వద్ద శుక్రవారం చిరుత సంచరించడం రాజంపేటకు చెందిన కొందరు ప్రయాణికులు గుర్తించారు. చిరుత రోడ్డు దాటే క్రమంలో కొద్దిదూరంలోనే వాహనదారులు ఆగిపోయారు.చిరుత తిరుగుతుండటంతో అటవీ గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ సిబ్బంది సూచిస్తున్నారు.

అన్నదాత ఆక్రందన

- గిట్టుబాటు ధర లభించక ఆందోళన
- వ్యాపారులు, దళారుల కుమ్మక్కుతో రైతులకు నష్టం
- ధరలు తగ్గించడంతో రోడ్డెక్కుతున్న బొప్పాయి రైతులు
- గతంలో రూ. 14–20 వేల వరకు పలికిన ధర


తోటలో సాగులో ఉన్న బొప్పాయి


రైల్వేకోడూరులో బొప్పాయి లారీని నిలిపి నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు (ఫైల్)



సాక్షి రాయచోటి: కూటమి సర్కార్ ఏర్పడిన నాటి నుంచి రైతులకు కష్టాలు తప్పడం లేదు. ఒకవైపు కరువు, మరోవైపు పెనుగాలులతో ప్రకృతి అతలాకుతలం చేసింది. ప్రస్తుతం జిల్లాలో వర్షాలు లేక కరువు ఛాయలు అలుముకున్నాయి. ప్రభుత్వం ఉన్నా..ధరల స్థిరీకరణ నిధి లేకపోవడంతో పండ్ల తోటల రైతుల కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఎన్నెన్నో అగచాట్లు పడి పంట పండిస్తే తీరా నోటికి కాడికి వచ్చేసరికి ధరల విషయంలో దళారులు, వ్యాపారులు ఆడుతున్న నాటకంలో రైతులు బలి పశువులుగా మారుతున్నారు. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చి ఏడాది దాటింది. అయితే ధరల గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో ఇటీవల వరుసగా దోస, టమాటా, మామిడి, అరటి రైతులు పడిపోయిన ధరలతో అమ్ముకోలేక నష్టాల పాలయ్యారు. ప్రస్తుతం బొప్పాయి పంటకు కూడా ధరలు ఒక్కసారిగా వ్యాపారులు తగ్గించడంతో రైతన్నలు రోడ్డెక్కారు.

వ్యాపారులతో దళారుల ములాఖత్
జిల్లాలోని రైల్వేకోడూరు, రాజంపేట నియోజకవర్గాలతోపాటు కలికిరి, మదనపల్లె, కలకడ, గుర్రంకొండ, పీలేరు తదితర ప్రాంతాల్లో బొప్పాయి పంట విస్తారంగా సాగు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 30 వేల ఎకరాలకు పైగా పంట సాగైంది. ఇంతవరకు బాగానే ఉన్నా...తీరా పంట చేతికివచ్చాక దళారులు, వ్యాపారులు ములాఖత్‌గా మారి ధరలు తగ్గిస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన సేట్‌లుస్థానికంగా దళారులతో కుమ్మక్కై అమాంతం ధరలను తగ్గిస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతులు రోడ్డెక్కాల్సి పరిస్థితి నెలకొంది. ఇటీవల కాలంలో రాజంపేట, రైల్వేకోడూరు, చిట్వేలి ఇలా అన్నిచోట్ల మద్దతు ధర కోసం బొప్పాయి రైతులు రోడ్డుపైకి వచ్చి న్యాయం కోరుతున్నారు. ఇతర రాష్ట్రాల వ్యాపారులు, స్థానికంగా ఉన్న దళారులు తమను అడిగే వారు ఎవరూ లేరన్న ధైర్యంతో ఎంత అనుకుంటే అంత...ఎప్పుడంటే అప్పుడు ధరలను తగ్గించేసి బొప్పాయి రైతులతో చెలగాటమాడుతున్నారు.

టన్ను బొప్పాయి రూ. 5–7 వేలు మాత్రమే
జిల్లాలో బొప్పాయి పంటకు సంబంధించి ప్రధానంగా రైల్వేకోడూరు, రాజంపేట నియోజకవర్గాల్లోనే సమస్య ఉత్పన్నమవుతోంది. ఉన్నట్లుండి ధరలు తగ్గిస్తుండడంతో రైతన్నలు పోరుబాట పడుతున్నారు. మొన్నటివరకు రూ. 7–10 వేలు పలికిన ధరను అమాంతంగా కేవలం రూ. 5–7 వేలలోపుకు తగ్గించారు. ఉన్నతాధికారులు పర్యటించి న్యాయం చేస్తామంటున్నా ఇప్పటివరకు ఆ దిశగా ప్రయత్నాలు సాగకపోవడంతో మరొకమారు రైతన్నలు రోడ్లపైకి వస్తున్నారు.

అప్పులే మిగిలాయి



బొప్పాయికి సంబంధించి దళారులతో వ్యాపారులు కుమ్మక్కయ్యారు. ఈ కారణంగా ధరలు లేక తీవ్రంగా నష్టపోతున్నాం. పంట చేతికి వచ్చేసరికి పెట్టుబడులు దక్కని పరిస్థితి నెలకొంది. దీంతో మాకు అప్పులే మిగిలాయి. – దేగల విజయ్ కుమార్, గాదెల కొత్తపల్లి, ఓబులవారిపల్లె మండలం

గిట్టుబాటు ధరలు దక్కేలా చర్యలు చేపట్టాలి



కనీస ధర కిలోకు రూ.8 కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలిచ్చారు. అయితే దళారులు రూ.5 నిర్ణయించడం దారుణం. కలెక్టర్ ఆదేశాల మేరకు బొప్పాయికి గిట్టుబాటు ధరలు దక్కేలా అధికారులు తగిన చర్యలు చేపట్టాలి. – నరసింహ, రైతు, గాదెల, ఓబులవారిపల్లె మండలం

ఎప్పుడూ ఇంత తక్కువ ధర లేదు



ఇటీవల కాలంలో బొప్పాయి ఇంత తక్కువగా ఎప్పుడూ అమ్ముడు పోలేదు. దళారులు మా లాంటి రైతులను దోచుకోవడానికి చేస్తున్న కుట్ర. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి. –పైనం సుబ్బరాయుడు, రాఘవరాజపురం, రైల్వేకోడూరు మండలం

వైఎస్ జగన్ సర్కార్‌లో రైతులకు మంచి రోజులు

అన్నమయ్య జిల్లా పండ్ల తోటలకు ప్రసిద్ధి. ప్రధానంగా మామిడి, అరటి, బొప్పాయి, చీనీ, దోస, దానిమ్మ ఇలా చెబుతూ పోతే అనేక రకాల పండ్ల తోటలు సాగులో ఉన్నాయి. వైఎస్సార్ సీపీ సర్కార్ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేయడంతోపాటు ఎప్పటికప్పుడు ధరలపై సమీక్షిస్తూ వచ్చారు. దీంతో ఇతర పండ్లు, కూరగాయల తోటలతోపాటు బొప్పాయికి కూడా మంచి ధర పలికింది. గతంలో టన్ను ఒక్కోసారి రూ.20 వేలకు కూడా అమ్ముకున్నారు. ఇటీవల కొన్నిరోజులుగా టన్ను బొప్పాయి రూ. 16 వేలు ధర పలుకగా, ప్రస్తుతం ఒక్కసారిగా రూ. 9–10 వేలకు తగ్గించడంపై రైలులు తీవ్ర స్థాయిలో ఆందోళన చెందారు. మళ్లీ ఇప్పుడు రూ. 5–7వేలలోపే కొనుగోలు చేసేందుకు ముందుకు రావడంపై బొప్పాయి రైతులు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. కూటమి సర్కార్‌లో పండ్ల తోటల రైతులకు గిట్టుబాటు ధర లభించకపోవడంతో అన్నిచోట్ల ఆగ్రహం వ్యక్తమవుతోంది.

బొప్పాయి రైతులను ఆదుకుంటాం: కలెక్టర్ శ్రీధర్

చిట్వేలి: బొప్పాయి రైతులను ఆదుకుంటామని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ అన్నారు. శనివారం మండలంలోని ఎం గొల్లపల్లి, దేవమాచుపల్లిలో బొప్పాయి తోటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ చిట్వేలి, పెనగలూరు మండలాల్లో 58400 టన్నుల బొప్పాయిని రైతులు సాగుచేస్తున్నారన్నారు. ప్రస్తుతం 34500 టన్నులు విక్రయించగా 23900 టన్నుల పంట ఉందన్నారు. రైతులు, ట్రేడర్లు, దళారులను సమావేశ పరిచి బొప్పాయి కిలోకు రూ. 8 ధరగా నిర్ణయించారు. ధరలు తగ్గకుండా ఉండేందుకు పోలీసు, రెవెన్యూ, హార్టికల్చర్, ఇతర ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసి చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు.రైతులకు సమాచారం అందించేందుకు ప్రత్యేకంగా కంట్రోల్ రూము కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.


దేవమాచుపల్లిలో బొప్పాయి రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

'యూరియా అందుబాటులో ఉంది'


మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటి: జిల్లాలో యూరియా అందుబాటులో ఉందని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. శనివారం రాత్రి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలోని యూరియా నిల్వ, బొప్పాయికి మద్దతు ధర తదితర అంశాలపై కలెక్టర్ జిల్లా ఎస్పీ వి విద్యాసాగర్ నాయుడుతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. తప్పుడు కథనాలతో రైతులను ఆందోళనకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారులు, ట్రేడర్స్, రైతు సంఘాల సమన్వయంతో బొప్పాయి ధర నిర్ణయించినట్లు చెప్పారు. టాప్ గ్రేడ్ బొప్పాయి కిలో రూ. 8, సెకండ్ గ్రేడ్ కిలో రూ. 7.50లుగా నేడు నిర్ణయించారన్నారు. ఎస్పీ విద్యాసాగర్ నాయుడు మాట్లాడుతూ జిల్లాలో పంట తక్కువగా సాగు చేస్తున్నందున యూరియా అవసరం తక్కువగా ఉంటుందన్నారు. ప్రైవేట్ డీలర్ల వద్ద, రైతు సేవా కేంద్రాల్లో రైతులకు అవసరమయ్యే యూరియా అందుబాటులో ఉందన్నారు. కొంతమంది రైతులను రెచ్చగొట్టడం, కృత్రిమంగా యూరియా కొరత సృష్టించడం వంటి పనులు చేస్తున్నారన్నారు. ఈ పనులు చట్టరీత్యా నేరమని, అటువంటి పనులు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎల్‌ఎల్‌బీ ఫలితాల విడుదల

కడప ఎడ్యుకేషన్: యోగివేమన విశ్వవిద్యాల యం ఎల్‌ఎల్‌బీ (మూడేళ్ల, ఐదేళ్ల) మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు శనివారం సాయంత్రం తన చాంబర్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌ఎల్‌బీ (ఐదేళ్ల) మొదటి సెమిస్టర్ పరీక్షల్లో 50.42 శాతం మంది, ఎల్‌ఎల్‌బీ (మూడేళ్ల) మొదటి సెమిస్టర్ ఫలితాల్లో 17.63 శాతం మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ పి.పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ వీఎస్‌వీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమం పట్టని ప్రభుత్వం

- వైఎస్సార్‌సీపీ నేతలు ఆకేపాటి అమరనాథరెడ్డి, సురేష్‌బాబు
- 9న 'అన్నదాత పోరు'ను విజయవంతం చేయాలి


రాయచోటిలో అన్నదాత పోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆకేపాటి అమరనాథరెడ్డి, కె సురేష్ బాబు తదితరులు

రాయచోటి: రైతు సంక్షేమం గురించి కూటమి ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, అన్నదాతలకు వైఎస్సార్‌సీపీ అండగా నిలుస్తుందని పార్టీ రాజంపేట పార్లమెంట్ పరిశీలకులు కె సురేష్‌బాబు, జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి పేర్కొన్నారు. రాయచోటిలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఈనెల 9న కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న అన్నదాత పోరుకు సంబంధించిన పోస్టర్‌ను రాయచోటి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషాతో కలిసి వారు ఆవిష్కరించారు. రైతులు యూరియా కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నా కూటమి ప్రభుత్వానికి కనికరం లేదని విమర్శించారు. ఎరువుల కోసం రైతులు క్యూలో నిలుచుంటే వారికి బఫే ఏర్పాటు చేయాలా అంటూ వ్యవసాయశాఖ మంత్రి అవహేళనగా మాట్లాడటం దారుణమని అన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి, వేలకోట్ల రూపాయల ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసి రైతులను అన్ని విధాలా ఆదుకున్నట్లు చెప్పారు పోరుబాట ద్వారా రైతు వ్యతిరేక ప్రభుత్వం మెడలు వంచాలన్నారు. యూరియాతో సహా రైతులకు అవసరమైన ఎరువులను వెంటనే పంపిణీ చేయాలన్నారు. ఎరువులు పక్కదోవ పట్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఉచిత పంటల భీమాను పునరుద్ధరించి వర్తింపజేయాలని వారు డిమాండ్ చేశారు. వర్షాల కారణంగా పంటలు దెబ్బతిన్న రైతులకు వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి ఈనెల 9న నిర్వహించే అన్నదాత పోరుబాట కార్యక్రమంలో జిల్లావ్యాప్తంగా ఉన్న రైతులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాడు వైభవం..నేడు సేవాలోపం

- ఇటు జిల్లా ఆస్పత్రి కాదు, అటు వైద్య కళాశాల కాదు
- పేరుకు మాత్రమే ప్రిన్సిపాల్ పోస్టు
- సూపరిండెంట్, ప్రిన్సిపాల్ పోస్టులు ఒక్కరికే
- కూటమి ప్రభుత్వం రాకతో వైద్య సేవలు హరీ
- 80 మంది వైద్యులుండగా ఇప్పుడు 17 మందితో అరకొర వైద్యం


వైద్యులులేని ఓపీ విభాగంలో ఫార్మసీ విద్యార్థిని


రోగుల సంఖ్య తగ్గి రద్దీలేని ఆస్పత్రి

మదనపల్లి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ కళకళలాడిన మదనపల్లె ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రి ఇప్పుడు రెంటికి చెడ్డ రేవడిగా మారింది. ఇటు జిల్లా ఆస్పత్రిగా, అటు వైద్య కళాశాలగా కాకుండా కొనసాగిస్తుండటంతో పేదలకు వైద్యసేవలు అందక అవస్థలు పడుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మదనపల్లెకు వైద్య కళాశాలను మంజూరు చేయగా నిర్మాణ పనులను శానిటోరియం సమీపంలో 95.5 ఎకరాల విస్తీర్ణంలో రూ.475 కోట్ల వ్యయంతో చేపట్టారు. కూటమి ప్రభుత్వం రాకతో కళాశాల నిర్మాణ పనులను నిలిపివేయడం, స్థానిక జిల్లా ఆస్పత్రిలో కొనసాగుతున్న వైద్య కళాశాల నిర్వహణను వెనక్కు తీసుకోవడంతో నిరుపేద రోగులకు వైద్య సేవలు నిర్వీర్యం అయ్యాయి.

కళకళలాడిన ఆస్పత్రి
వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏరియా, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆస్పత్రులను డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ పరిధిలోకి తీసుకొచ్చారు. దీంతో మదనపల్లె జిల్లా ఆస్పత్రి దీని పరిధిలోకి వెళ్లింది. తర్వాత మదనపల్లెకు వైద్య కళాశాలను మంజూరు చేయడంతో వైద్య కళాశాల విధులను జిల్లా ఆస్పత్రిలో కొనసాగించగా డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలోకి వెళ్లింది. 2023 నుంచి 2024 జూన్ వరకు ఆస్పత్రి వైద్య సేవలతో కళకళలాడింది. ప్రతిరోజూ 1,000 మందికి దాక రోగులు ఓపీ పొందారు. ఇన్‌పేషంట్లుగా నెలకు 650 మందికి తగ్గకుండా సేవలు పొందారు. 2023 నవంబర్‌లో అత్యధికంగా 23,757 మంది ఓపీ, ఏప్రిల్‌లో అత్యధికంగా 1,614 మంది ఇన్‌పేషెంట్ వైద్య సేవలు పొందారు. 2024లో (వైద్య సేవలను ప్రభుత్వం ఉపసంహరించుకునే దాక) సెప్టెంబర్ నెలలో అత్యధికంగా 29,164 మంది ఓపీ, మార్చిలో 2,973 మంది ఇన్‌పేషంట్లుగా వైద్య సేవలు పొందారు.

వైద్య కళాశాలలో అందిన సేవలు



	2023-24 (ఏప్రిల్-మార్చి)	2024-25 (ఏప్రిల్-మార్చి)
ఓపీ రోగులు	2,52,106	2,83,035
ఇన్ పేషెంట్లు	19,584	16,773
సిజేరియన్లు	1,524	1,557
సహజ ప్రసవాలు	1,481	1,319

80 నుంచి 17కు తగ్గారు
జిల్లా ఆస్పత్రిలో వైద్య కళాశాలను కొనసాగించడంతో ఒక్కసారిగా వైద్యుల సంఖ్య 80కి పెరిగింది. వివిధ వ్యాధులకు సంబంధించి ప్రత్యేక నిపుణులు, వైద్యులు, ప్రొఫెసర్లు నియమితులయ్యారు. దీంతో మారుమూల ప్రాంతాలైన తంబళ్లపల్లె, పీలేరు, పుంగనూరు నియోజకవర్గ ప్రజలకు వైద్యసేవల పరంగా ఎంతో ప్రయోజనకరంగా మారింది. దీంతో ప్రజలు ఇక్కడికి వచ్చి వైద్య సేవలను ఉచితంగా పొందుతూ సంతృప్తి వ్యక్తం చేసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వైద్య కళాశాల వసతులను నిలిపివేస్తూ నియమించిన వైద్యులను వెనక్కు తీసుకోవడంతో 80 మంది ఉన్న వైద్యుల సంఖ్య ప్రస్తుతం 17కి తగ్గిపోయింది. ఫలితంగా మెరుగైన వైద్య సేవలు అందించలేని పరిస్థితులు నెలకొన్నాయి.

వైద్యులపై తీవ్ర ఒత్తిడి
మదనపల్లె ఆస్పత్రికి ప్రస్తుతం రోజుకు 500 మందికి పైగా రోగులు ఓపీకి వస్తున్నారు. వీరిని పరీక్షించి సేవలు అందించడానికి వైద్యుల సంఖ్య సరిపోవడం లేదు.దీంతో వైద్యులు మానసికంగా ఒత్తిడికి గురవుతున్నారు. రోగుల సంఖ్యకు తగ్గట్టుగా వైద్యులు ఉండాల్సి ఉండగా ఆ పరిస్థితి లేదు. ఫలితంగా రోగులకు సేవలు అందించే విషయంలో జాప్యం నెలకొంటోంది. ఒక్కోసారి ఓపీ గదుల్లో వైద్యుల కుర్చీలు ఖాళీగా కనిపిస్తుంటాయి. నిపుణులైన వైద్యులు లేకపోవడంతో రోగులు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉచితంగా అందిన ఖరీదైన వైద్యం ఇప్పుడు లేక రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏమని పిలవాలి..


మదనపల్లె ప్రభుత్వాసుపత్రి

ప్రస్తుతం మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రిని జిల్లా ఆస్పత్రిగా పిలవాలో, వైద్య కళాశాలగా పిలవాలో తెలియని పరిస్థితి నెలకొంది. అయితే విచిత్రంగా ప్రభుత్వం రెండు పోస్టులు కొనసాగిస్తోంది. జిల్లా ఆస్పత్రికి ఉండే సూపరిండెంట్ పోస్టు, వైద్య కళాశాలకు ఉండే ప్రిన్సిపాల్ పోస్టును కొనసాగిస్తోంది. ఈ రెండు పోస్టులకు సీనియర్ అధికారి కోటేశ్వరీకి అప్పగించారు. ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చూసేందుకు వైద్య కళాశాల కొనసాగలేదు. సూపరిండెంట్‌గా ఉండేలా జిల్లా ఆస్పత్రిని చేసినట్టుగా కూడా లేదని తెలుస్తోంది. అయితే రెండు పోస్టులు కొనసాగిస్తుండటంతో జిల్లా ఆస్పత్రి, వైద్య కళాశాల రెండు కొనసాగుతున్నట్టుగానే భావించాల్సి వస్తుంది.

క్లుప్తంగా

దుకాణానికి నిప్పు పెట్టినవారిపై కేసు

ఒంటిమిట్ట : ఇచ్చిన అప్పును అడిగినందుకు చిల్లర దుకాణంపై పెట్రోల్ పోసి కాల్చిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఒంటిమిట్ట సీఐ బాబు శనివారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు...కల్యాణ్ రామ్ టౌన్ షిప్ వద్ద పెద్దకొత్తపల్లికి చెందిన పట్నం పెంచలయ్య గత కొన్నేళ్లుగా చిల్లర దుకాణం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడన్నారు. ఆ దుకాణంలో కొంత కాలం క్రితం కట్టా మల్లికార్జున అనే వ్యక్తి చిల్లర బాకీ ఉన్నాడన్నారు. ఆ బాకీని చెల్లించమని శుక్రవారం మల్లికార్జునను పెంచలయ్య అడిగాడన్నారు. దీన్ని అవమానంగా భావించిన మల్లికార్జున మరో వ్యక్తితో కలిసి దుకాణదారుడు పెంచలయ్యపై దాడి చేసి ఆ తర్వాత దుకాణంపై పెట్రోల్ పోసి నిప్పంటించాడన్నారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మండల పరిధిలోని పోట్లదుర్తి గ్రామం వద్ద గత ఏడాది జూన్ 18న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చిట్టిపోయిన బాలరాజు ప్రొద్దుటూరు ఆసుపత్రుతి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడని డెర్రగుంట్ల పోలీసులు తెలిపారు. ప్రొద్దుటూరు మండలం పరిధిలోని కల్లూరు గ్రామానికి చెందిన బాలరాజు మరో ఐదు మందితో కలిసి గత ఏడాది జూన్ 18వ తేదీన ఎర్రగుంట్ల రైల్వే స్టేషన్ నుంచి ఆటోలో స్వగ్రామానికి బయలుదేరాడు. పోట్లదుర్తి గ్రామ వద్దకు రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో బాలరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. అప్పటి నుంచి అపస్మారక స్థితిలో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రితో చికిత్స పొందుతూ ఉన్నాడు. కోలుకోలేక శనివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

వల్లూరు(చెన్నూరు) : చెన్నూరు మండల పరిధిలోని పాలెంపల్లె వద్ద శనివారం 18 బస్తాల అక్రమ రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు చెన్నూరు సీఐ క్రిష్ణారెడ్డి పోలీసు సిబ్బందితో కలిసి పాలెంపల్లె వద్ద వున్న చంద్రశేఖర్‌రెడ్డి అనే వ్యక్తికి చెందిన గోడౌన్‌లో తనిఖీలు నిర్వహించారు. ఇందులో అక్రమంగా నిలువ వుంచిన 18 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చెరువు మట్టి.. నిలువునా లూటీ!



నార్లపల్లె చెరువులో రెండు జేసీబీలు, పలు టిప్పర్లతో మట్టి తరలిస్తున్న దృశ్యం



సర్కారుతోపు వద్ద హైవే పక్కన రియల్ భూమి చదునుకు తోలుతున్న చెరువు మట్టి

- రెచ్చిపోతున్న రియల్ మాఫియా
- చేతులు కట్టుకున్న అధికార యంత్రాంగం

కురబలకోట : మండలంలోని నార్లపల్లె చెరువును మట్టి మాఫియా కబలిస్తోంది. జేసీబీలు, టిప్పర్లతో యథేచ్ఛగా మట్టితోలి అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. మూడు రోజులుగా చెరువులో జేసీబీలతో టిప్పర్లతో పబ్లిక్‌గా మట్టి తోలుతున్నా అధికార యంత్రాంగం మాత్రం చేతులు కట్టుకుని చోద్యం చూస్తున్నట్లుగా ఉంది. పరిసర గ్రామాల రైతులు నిట్టూరుస్తున్నారు. యథేచ్ఛగా అక్రమంగా చింతమాకులపల్లె సచివాలయం ఎదురుగా హైవే పక్కన ఉన్న రియల్ భూములకు ఈ మట్టి తోలుతున్నారు. అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని విమర్శిస్తున్నారు. అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు మట్టిమాఫీయాకు మద్దతుగా నిలిచినట్లు చెబుతున్నారు. నాణ్యమైన మట్టి గ్రావెల్ కావడంతో ఈ చెరువు మట్టిని లూటీ చేస్తున్నారు. సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చినా వారు పట్టించుకోకపోవడం విడ్డూరంగా వుంది. వా మౌనంపై పరిసర గ్రామాల వారు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. టిప్పర్ మట్టి దూరాభారం బట్టి రూ. 10 వేల నుండి రూ.20 వేల వరకు కూడా పలుకుతోంది. మట్టి తోలడం ఆపకపోతే మట్టి మాఫియాను వారి వెనుక ఉన్న అధికార పార్టీ నాయకుడిని తరిమికొడతామని నార్లపల్లె చెరువుకు చెందిన ఆయకట్టు రైతులు హెచ్చరిస్తున్నారు. తరచూ ఇటుక బట్టీల నిర్వాహకులు కూడా ఈ మట్టిపై కన్నేసి కొల్లగొడుతున్నారు. కొందరు నాయకులు మట్టి తోలి జేబులు నింపుకుంటున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే ఈ చెరువును క్యాష్ మైన్స్‌గా వాడుకుంటున్నారు. పల్లె ప్రాణం చెరువు. ఇలాంటి చెరువును కొల్లగొడుతుండడంతో స్థానికంగా ఉద్రిక్త పరిస్థితులకు కూడా ఆస్కారం ఇస్తోంది. మట్టి మాఫియా నిర్వాకంపై జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. సంబంధిత అధికారులను విచారించగా చెరువు మట్టి తోలకుండా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పట్టపగలే రెండిళ్లలో చోరీ

గుర్రంకొండ : మండల కేంద్రమైన గుర్రంకొండలో పట్టపగలే రెండిళ్లలో చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగులు ఇళ్ల తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించి బీరువాల్లోని విలువైన వస్తువులు ఎత్తుకెళ్లారు. స్థానిక బలిజగడ్డ వీధిలో అపోలో రెడ్డెప్ప, పరసా శ్రీనివాసులు కుటుంబాలు వ్యవసాయం చేసుకొంటూ జీవనం సాగిస్తున్నారు. శనివారం వారు ఇళ్లకు తాళాలు వేసుకొని వ్యవసాయ పనుల నిమిత్తం పొలాల వద్దకు వెళ్లారు. మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూడగా అప్పటికే ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడం గమనించారు. రెండిళ్లలోని బీరువాలను బద్దలు గొట్టి అందులో వస్తువులు చోరీ చేసినట్లు గుర్తించారు. జనసంచారం తక్కువగా ఉన్న ఈ ప్రాంతంలో దయం 11 గంటల నుంచి 12 గంటల మధ్యలోనే చోరీలు జరిగినట్లు స్థానికులు పేర్కొన్నారు. కాగా అపోలో రెడ్డెప్ప ఇంట్లో విలువైన వస్తువులు ఏమీ లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. పరసా శ్రీనివాసులు ఇంట్లో మాత్రం రూ. 60 వేలు నగదు, ఒక ఉంగరం, ఒకచైను, ఒక జత కమ్మలు చోరీకి గురైనట్లు తేలింది. వీటి విలువ సుమారు రూ. 2.50 లక్షలు ఉంటుందని బాధితులు పేర్కొన్నారు. జరిగిన సంఘటనపై స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ రఘురామ్ తమ సిబ్బందితో సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. గత నెల రోజుల్లో ఇదే ప్రాంతంలో వరుసగా నాలుగు చోరీలు జరగడంతో జనం బెంబేలెత్తిపోతున్నారు.



బీరువా పగులగొట్టిన దుండగులు

ప్రభుత్వ మెడికల్ కళాశాలల
ప్రైవేటీకరణ దుర్మార్గం

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి



రాయచోటి : ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం రాయచోటిలో పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో పేద విద్యార్థుల భవిష్యత్తు కోసం నిర్మించిన మెడికల్ కళాశాలలను ప్రభుత్వం ప్రైవేటీకరణ పేరుతో ముందుకు సాగడం అన్యాయమని విమర్శించారు. రాష్ట్రంలో ప్రతి పార్లమెంటు నియోజకవర్గానికి ఒక మెడికల్ కళాశాల ఉండాలన్న దూర దృష్టితో గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సాహసోపేత నిర్ణయంతో ఒకేసారి 17 మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేశారన్నారు. వీటిలో ఏడు కళాశాలలకు ఎంసీఐ అనుమతులు లభించగా, మిగిలిన పది కళాశాలలకు ఎంసిఐ అనుమతులు ఇస్తే కూటమి ప్రభుత్వం స్వయంగా వాటిని తోసిపుచ్చిందన్నారు. ఒక మెడికల్ కళాశాల నుంచి రూ. 500 కోట్లు నుంచి రూ. 1000 కోట్లు వరకు కమీషన్లు తీసుకునే ప్రక్రియలో భాగంగానే ప్రైవేటు పరం చేయడం దుర్మార్గమన్నారు. 25 ఏళ్ల పాటు అధికారంలో ఉన్న చంద్రబాబు నాయుడు ఒక ప్రభుత్వ మెడికల్ కళాశాలను కూడా ఇవ్వలేదంటే ఆయన దృష్టిలో పేదవారి విలువ ఏమిటో బహిరంగంగా తెలుస్తోందని విమర్శించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను మానకపోతే రాష్ట్ర యువతతో కలిసి పెద్దఎత్తున ప్రభుత్వాన్ని నిలదీయాల్సి వస్తుందని హెచ్చరించారు.

భారత్ అగ్రదేశంగా అవతరించడమే మోదీ లక్ష్యం

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

రాజంపేట టౌన్ : భారతదేశం అగ్రదేశంగా అవతరించడమే ప్రధాన మంత్రి నరేంద్రమోదీ లక్ష్యమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. రాజంపేటకు చెందిన నాగోతు రమేష్‌నాయుడు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన తరువాత తొలిసారిగా రాజంపేటకు విచ్చేసిన సందర్భంగా శనివారం పట్టణంలోని ఏబీ చంద్రారెడ్డి గార్డెన్స్‌లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశ ఆర్థిక వ్యవస్థ దివాలా తీసిన తరుణంలో నరేంద్రమోదీ ప్రధాని అయ్యాక గాడిలో పెట్టారన్నారు. 2032 నాటికి భారతదేశం రెండవ అతిపెద్ద ఆర్థిక దేశంగా అవతరించబోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలకు బీజేపీలో పదవులు వస్తాయని తెలిపారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రైల్వేకోడూరు, ఆదోని, జమ్మలమడుగు ఎమ్మెల్యేలు అరవ శ్రీధర్, డాక్టర్ పార్థసారధి, ఆదినారాయణరెడ్డి, ఎమ్మెల్సీ జకియాఖానం, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



రాజంపేట టౌన్ : మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

సోలార్ సిస్టం ప్రారంభించిన మంత్రి

ఓబులవారిపల్లె : మంగంపేట గల్లా పెట్రోల్ బంక్‌లో శనివారం ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ సోలార్ సిస్టమ్‌ను ప్రారంభించారు. అనంతరం మంగంపేట గ్రామస్తులు తమ సమస్యలు పరిష్కరించాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రమేష్ నాయుడు, గల్లా శ్రీధర్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరణ

వీరబల్లి : వీరబల్లి మండలం సానిపాయి గ్రామంలో రాయచోటి అసెంబ్లీ కన్వీనర్ ముక్కుపోకు రమణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

రైతులను విస్మరించిన కూటమి ప్రభుత్వం



మాట్లాడుతున్న రావుల నరసింహారెడ్డి

రాయచోటి : అందరికీ అన్నం పెట్టే అన్నదాతను కూటమి ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రావుల నరసింహారెడ్డి విమర్శించారు. శనివారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో కూటమి పాలనలో రైతులకు జరుగుతున్న అన్యాయాలపై ఆయన మండిపడ్డారు. అధికారంలోకి రావడానికి అన్నదాత సుఖీభవ అనే పథకంతో రైతులను పూర్తిగా మోసం చేశారన్నారు. కనీసం ఇచ్చిన హామీలను కూడా అమలు చేయకుండా అంతా చేసేశామని గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. పంటలకు వేసుకునే ఎరువులు, మందుల కోసం కూడా రైతులు గంటలు, రోజుల తరబడి క్యూలైన్లలో వేచి ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. యూరియా అందుబాటులో లేకపోవడంతో బ్లాక్ మార్కెట్లో కొనుగోలు చేస్తున్న పరిస్థితులు నెలకొన్నాయన్నారు.

డ్వాక్రా నిధుల స్వాహాపై విచారణ జరపాలి

రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణం కొత్తపేటలోని శ్రీ చౌడేశ్వరీ దేవి అమ్మవారి డ్వాక్రా సంఘం గ్రూపునకు సంబంధించిన నిధుల స్వాహాపై విచారణ జరపాలని ప్రజా సంఘం నాయకుడు శెట్టిపల్లె సాయికుమార్ జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ గ్రూప్‌నకు గత ఏడాది జనవరి 11వ తేదీన రూ.12 లక్షలు రుణం మంజూరైందన్నారు. ఈ గ్రూపులో మొత్తం పది మంది ఉండాల్సి ఉండగా తొమ్మిది మంది మాత్రమే ఉన్నారని తెలిపారు. ఒక్కొక్కరికి రూ.97,000లు మాత్రమే వారి అకౌంట్‌లో జమ అయిందన్నారు. మిగిలిన రూ.3,27,000 ఏమి చేశారనే విషయమై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

దేవదాయ భూముల సర్వే



రామసముద్రం మండలం బల్లసముద్రంలో సర్వే చేస్తున్న అధికారులు

రామసముద్రం : రామసముద్రం మండలం ఆర్.నడింపల్లి పంచాయతీ బల్లసముద్రం గ్రామ సమీపంలో వెలసిన శ్రీ వాలీశ్వర స్వామి దేవాలయానికి సంబంధించిన భూములను శనివారం రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. భూముల హద్దులను గుర్తించారు. సర్వే నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని ఈఓ రమణ తెలిపారు. దేవదాయశాఖకు చెందిన భూములను కబ్జా చేస్తే చట్టపరమైన చర్యలతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రణభేరిని జయప్రదం చేయండి



రణభేరి పోస్టర్ల ఆవిష్కరణలో ఉపాధ్యాయ సంఘం నాయకులు

రాయచోటి : ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న ఆర్థిక, విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 15వ తేదీ నుంచి 19వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న యూటీఎఫ్ రణభేరిని జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్‌లు పిలుపునిచ్చారు. శనివారం రాయచోటిలో యూటీఎఫ్ జిల్లా కార్యాలయం వద్ద రణభేరికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉమ్మడి సర్వీసు రూల్స్ సమస్యకు ప్రభుత్వం పరిష్కారం చూపడం లేదన్నారు. బదిలీలు, ప్రమోషన్లు పూర్తయి మూడు నెలలు కావస్తున్నా ఉపాధ్యాయులు ఇంకా పాత స్థానాల్లో కొనసాగుతున్నారని తెలిపారు. నాణ్యమైన విద్యను అందిస్తామని చెబుతూనే ప్రభుత్వ పాఠశాలల నుంచి విద్యార్థులు ప్రైవేటుకు తరలిపోయేలా కార్యక్రమాలు రూపొందిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు పి.వెంకట సుబ్బయ్య, వై.శ్రీధర్ రెడ్డి, ఫణీంద్ర కుమార్ యాదవ్, రాష్ట్ర కౌన్సిలర్ డి.చెంగలరాజు, సీనియర్ నాయకులు ఎస్.లక్ష్మీకుమార్, ఎం.నాగేశ్వర్ గౌడ్, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగేంద్ర, మనోహర్, రామమూర్తి, శంకర్, శశికిరణ్, అమీన్, నాగార్జున, శివశంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగర శివార్లలోని ఫాతిమా కళాశాల సమీపంలోని ఎగువ రైలు పట్టాలపై ఓ వ్యక్తి గూడ్స్ రైలు కిందపడి మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మృతుడి వివరాలు తెలియరాలేదన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించామన్నారు. మృతదేహానికి సంబంధించి వివరాలు తెలిస్తే 94406 27658, 94409 00811 నెంబరులో తెలియజేయాలన్నారు.

చోరీ కేసులో వ్యక్తి అరెస్టు

రైళ్లలో చోరీకి పాల్పడుతున్న జయరాజు అనే వ్యక్తిని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు రైల్వే ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. నంద్యాల జిల్లా కోయిలకుంట్ల తాలూకా నొస్సం గ్రామానికి చెందిన జయరాజు రైలు ప్రయాణికుల వద్ద నుంచి ఒక సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ దొంగిలించాడన్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దొంగను అరెస్టు చేసి గుంతకల్లులోని రైల్వే కోర్టులో హాజరు పరచగా, జడ్జి రిమాండ్ విధించడంతో కడప కేంద్ర కారాగారానికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళ అదృశ్యం



అనూష (ఫైల్)

కలసపాడు : మండలంలోని చింతలపల్లె గ్రామానికి చెందిన గాలి అనూష గత నెల 15వ తేదీ నుండి కనిపించడం లేదని ఆమె తండ్రి గాలిప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ విజయకుమార్ తెలిపారు. గత నెల 15వ తేదీ అనూష ఇంటి నుండి వెళ్లి కనిపించలేదని శనివారం ఆమె తండ్రి ప్రసాద్ ఫిర్యాదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. మహిళ ఆచూకీ తెలిస్తే 9121100632 నెంబరుకు సమాచారం అందించాలని కోరారు.


అత్యాచారం కేసులో వ్యక్తి అరెస్టు



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న పోలీసు అధికారులు

వేముల : మైనర్ బాలిక అత్యాచారం కేసులో కుంచపు వెంకటరమణ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ ఉలసయ్య, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌లు తెలిపారు. వేముల పోలీస్ స్టేషన్‌లో శనివారం వారు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వేముల గ్రామానికి చెందిన కుంచపు వెంకటరమణ 2021లో స్థానికంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతుండేవాడు. మధ్యలో చదువు ఆపేసి అప్పటి నుండి బేల్దారి పనికి వెళ్లేవాడు. ఈ క్రమంలో గత నాలుగు నెలల నుండి వేముల గ్రామానికి చెందిన మైనర్ బాలికను ప్రేమిస్తున్నానంటూ వెంటపడుతుండేవాడు. ఈ నేపథ్యంలో గతనెల 30వ తేదీ బాలికను బలవంతంగా మోటార్ సైకిల్‌పై ఎక్కించుకుని వెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ సంఘటనకు సంబంధించి బాధిత బాలిక ఫిర్యాదు మేరకు కుంచపు వెంకటరమణపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. నిందితుడిని శుక్రవారం సాయంత్రం అరెస్టు చేశారు. శనివారం కోర్టులో హాజరుపరచగా కోర్టు రిమాండ్ విధించినట్లు వారు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఆరోగ్యమాత ఉత్సవాలు



ఆరోగ్యమాత సందేశాన్ని తెలియజేస్తున్న గురువులు

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగరంలోని ఆరోగ్యమాత ఉత్సవాల్లో భాగంగా శనివారం 9వ రోజున నవదిన పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నల్గొండ డాన్‌బాస్కో ప్రిన్సిపాల్ తాళ్ల విల్సన్ సందేశాన్ని అందజేశారు. తొలుత అలంకరించిన పల్లకీపై మరియమాత స్వరూపాన్ని ఉంచి చర్చి ప్రాంగణంలో విశ్వాసులు స్తుతి గీతాలు ఆలపిస్తూ ప్రదక్షిణలు నిర్వహించారు. ఈ సందర్భంగా గురువులు ఆరోగ్యమాత సందేశాన్ని వినిపించారు. భక్తులు స్తుతి గీతాలు ఆలపించారు. తేరు, దివ్య బలిపీఠాలను అలంకరించారు.

పిల్లల రక్షణ చట్టాల అమలుపై సమీక్ష



జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి. యామిని

కడప అర్బన్ : రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ డాక్టర్ సి.యామిని, సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ ఎస్. బాబా ఫక్రుద్దీన్ ఆధ్వర్యంలో శనివారం కడపలోని కోర్టు ప్రాంగణంలో గల న్యాయ సేవా సదన్‌లో ×బాలల న్యాయం, పిల్లల రక్షణ చట్టాల అమలులో సమస్యలు, సవాళ్లు మొదలగు అంశాలపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి. యామిని మాట్లాడుతూ ×బాలల న్యాయం, జేజేబీ చట్టం 2015, పోక్సో చట్టం 2012, పీసీఎంఏ 2006, బాల కార్మిక (నిషేధ మరియు నియంత్రణ) చట్టం 1986, పీసీ మరియు పీఎన్‌డీటీ చట్టం 1994, ఆర్టీఈ 2009, హెచ్ఏఎంఏ చట్టం 1956, ఆంధ్రప్రదేశ్ పంచాయతీ వికాస చట్టం 1977, ఎంటీపీ చట్టం 2021, అంగీకారాలు ఉన్న వ్యక్తుల హక్కుల చట్టం 2016 మొదలగు చట్టాల అమలులో సమస్యలు, సవాళ్లు మొదలు అంశాలపై వివరించారు. శాఖల వారీగా సమస్యలు, సవాళ్లు అంశాలను ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. బాల్య వివాహాలు, గర్భధారణ, పిల్లల ఆరోగ్యం, విద్య, పునరావాసం, ప్రభుత్వ పథకాలు, దూరప్రాంతాల పిల్లల సదుపాయాలు అనే అంశాలను వివరించారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100, చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098, దివ్యాంగ జన్ హెల్ప్ లైన్ నెంబర్ 14456 అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫస్ట్ అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కడప కం జ్యువెనల్స్ బోర్డ్ ప్రిన్సిపల్ మెజిస్ట్రేట్ కె. భార్గవి, జిల్లాలో వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో
వైవీయూకు ఉన్నత స్థానం

వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య అల్లం శ్రీనివాసరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైవీయూ వీసీ అల్లం శ్రీనివాసరావు

కడప ఎడ్యుకేషన్ : బోధన, పరిశోధన, సేవ అనే దృక్పథంతో ఏర్పాటైన యోగి వేమన విశ్వవిద్యాలయం అనతి కాలంలోనే అత్యున్నత ప్రమాణాలతో పరిశోధనలతో ప్రముఖ విశ్వవిద్యాలయంగా కీర్తిని అందుకుంది. తాజాగా కేంద్ర ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ విడుదల చేసిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్)-2025లో యోగి వేమన విశ్వవిద్యాలయానికి 51 నుంచి 100 లోపు ర్యాంకు లభించిందని విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు వెల్లడించారు. శనివారం విశ్వవిద్యాలయంలోని తన ఛాంబర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశంలో స్టేట్ పబ్లిక్ యూనివర్సిటీస్ 500 పైన ఉండగా అందులో వైవీయూ 51 నుంచి వందలోపు ర్యాంకు దక్కించుకోవడం విశ్వవిద్యాలయ సమష్టి కృషికి నిదర్శనమన్నారు. 2006లో ఏర్పాటైన వైవీయూ పాత విశ్వవిద్యాలయాలైన అనంతపురం జేఎన్టీయూ, ఎస్కేయూ, పద్మావతి విశ్వవిద్యాలయం వంటి వాటి సరసన నిలిచిందన్నారు. వైవీయూలో రామన్ ఫెలోషిప్, డాడ్ ఫెలోషిప్ పొందిన అధ్యాపకులు పనిచేస్తున్నారని అలాగే జర్మనీ, యూకే, యూఎస్ లలో పరిశోధనలు చేస్తున్నారని తెలిపారు. సెంట్రల్ యూనివర్సిటీ పరిధిలో సెవెన్ స్పోక్ యూనివర్సిటీలను ఎంపిక చేయగా వాటిలో ఒకటి శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ రెండవది వైవీయూ కావడం గర్వకారణం అన్నారు. తద్వారా వైవీయూలో పరిశోధనకు రూ. 10 కోట్ల నిధులు రానున్నాయన్నారు. నిర్ణీత సమయంలో భారత ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు నివేదికలు పంపిస్తూ మంచి ర్యాంకులు యూనివర్సిటీ సొంతం చేసుకోవడానికి కృషి చేస్తున్న ఐక్యూఏసీ బృందాన్ని వీసీ అభినందించారు.

విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ మాట్లాడుతూ విద్యార్థుల సౌకర్యాలు, ప్లేస్‌మెంట్‌పైన ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. ఇంటర్నల్ క్వాలిటీ అసూరెన్స్ సెల్ (ఐక్యూ ఏసీ) సంచాలకులు డాక్టర్ ఎల్.సుబ్రహ్మణ్యం శర్మ, పీఎం ఉషా సమన్వయకర్త డాక్టర్ టి.చంద్రశేఖర్ మాట్లాడుతూ 2027 నాటికి 100 ప్రాజెక్టులతో న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ కోసం పోటీ పడతామని తెలిపారు. ఈ సమావేశంలో ఐక్యూఏసీ అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ సుభాష్ చంద్ర, సభ్యులు డాక్టర్ దాక్షాయని, డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు, ప్రజా సంబంధాల విభాగం సంచాలకులు డాక్టర్ పి. సరిత, డాక్టర్ కె. శ్రీనివాసరావు, డాక్టర్ తుమ్మలూరు .సురేష్ బాబు పాల్గొన్నారు.